క్లుప్తంగా

విద్యార్థులకు సైన్స్ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు సైన్స్ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ఎస్‌వీఎస్ మునిసిపల్ పాఠశాల విద్యార్థులకు సైన్స్ మెటీరియల్ పుస్తకాలను అందించారు. పట్టణానికి చెందిన జీడిగుంట సుశీల, ప్రసాదరావు పేరుతో జి సునీల్ సుమారు రూ.5 వేల విలువచేసే మెటీరియల్‌ను 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, వెంకటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువకు షట్టర్ ఏర్పాటు



కే లంక ఛానల్ పై ఏర్పాటు చేసిన షట్టర్ ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల గ్రామ పరిధిలోని కె.లంక పంటకాలువపై నూతనంగా ఏర్పాటు చేసిన షట్టర్‌ను సోమవారం ప్రారంభించారు. సుమారు 15 ఏళ్ల క్రితం కాలువకు ఉన్న డ్యామ్ శిథిలావస్థకు చేరి పూర్తిగా పాడైపోయింది. నీటిసంఘం అధ్యక్షుడు మొగళ్ళ మాధవరావు చొరవతో సుమారు రూ.40 వేలు ఖర్చు చేసి కొత్త డ్యామ్ నిర్మాణం చేసి, షట్టర్ ఏర్పాటు చేశారు. దీని వల్ల లంక కాలువ పరిధిలోని 2 వేల ఎకరాల ఆయకట్టుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, ఇరిగేషన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడి దారుణం



ప్రకాశంచౌక్ సెంటర్‌లో సీపీఎం నాయకుల నిరసన

భీమవరం: ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా దాడి అత్యంత దుర్మార్గమన్నారు. ఒక పక్క ఇజ్రాయిల్ మరో పక్క అమెరికా ఇరాన్ దేశంపై దాడులు చేస్తూ ప్రపంచ ప్రజానీకం రక్షణ కోసం దాడిచేస్తున్నామని చెప్పడం అవాస్తవమన్నారు. అమెరికా దాడులను ప్రజానీకం అంతా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వరి ఉద్యాన పంటలపై ఒకరోజు శిక్షణ

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయిలో వరి, ఉద్యాన, ఆయిల్‌పామ్ పంటలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంటలను సోకే చీడపీడలు, వాటి పరిష్కారం, నివారణా మార్గాలు సూచించడం జరుగుతుందన్నారు. రైతులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

25న ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: జిల్లాలోని డిజేబుల్ పీపుల్ యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25వ తేదీన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ నైపుణ్యాభివృద్ధి అధికారి పి లోకమాన్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ పోస్టర్‌ను డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని లోకమాన్ తెలిపారు. దాదాపు 400కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 18–35 ఏళ్ల వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, వివరాలకు 95020 24765 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భవనాలు శిథిలం.. జర భద్రం

- అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ప్రభుత్వ భవనాలు
- విష పురుగులు సైతం సంచరిస్తున్నాయని స్థానికుల ఆవేదన



స్థానిక ఠాణా వీధిలో నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహ భవనం



పెదపేటలోని శిథిలావస్థలో ఉన్న బీసీ వసతి గృహం

ఆకివీడు: శిథిలావస్థకు చేరిన భవనాలతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని, అంతేకాకుండా ఖాళీ ప్రదేశాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా హాస్టళ్ల భవనాలు

స్థానిక ఠాణా వీధిలోని బాలికల వసత గృహం భవనం పూర్తిగా పాడైపోయింది. నూతన భవనం నిర్మించేందుకు తగినన్ని నిధులు లేకపోవడంతో వసతి గృహాన్ని భీమవరంనకు తరలించారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ భవనంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సుమారు రూ.2 కోట్లు విలువ చేసే ఈ స్థలాన్ని ప్రభుత్వం ఇలా నిరుపయోగంగా వదలేయడం భావ్యం కాదని అంటున్నారు. ఈ స్థలంలో నూతన భవనం నిర్మించాలని, లేదంటే ఇతర ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా స్థానిక పెదపేటలోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ప్రాంతం ముంపునకు గురవుతుంది. పైనుంచి శ్లాబ్‌పెచ్చులు ఊడి పడుతున్నాయి. భవనంలోని మిగిలిన ప్రాంగణంలో క్రిమికీటకాలు, పాములు సంచరిస్తున్నాయి. విలువైన ఈ భూమిలో కూడా ప్రభుత్వ భవనాలు నిర్మించుకోవచ్చునంటున్నారు. కాళ్ల గ్రామంలో బాలుర వసతి గృహం భవనం శిథిలమైపోయింది. ప్రస్తుతం బాలుర వసతి గృహాన్ని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలోకి తరలించారు. బాలికల వసతి గృహంను ఉండి మండలం తరలించారు.

ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థలోనే...

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం కమ్ గెస్ట్ హౌస్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో పక్కనే మరో భవనం నిర్మించి కార్యాలయాన్ని అందులోకి మార్చారు. అలాగే ఉండి మండలలలోని ఆర్ అండ్‌బీ కార్యాలయ భవనం శిథిలమైపోయింది. ప్రస్తుతం కార్యాలయాన్ని భీమవరం తరలించారు. పాలకోడేరులోని తహసీల్దార్ కార్యాలయం శిథిలమైపోయింది. ఈ ప్రాంతాన్ని పోలీస్ యంత్రాంగం ప్రమాద వాహనాల్ని, రైడింగ్‌లో దొరికిన వాహనాల్ని డంప్ చేస్తున్నాయి. ప్రస్తుతం సచివాలయ భవనంలో రెవెన్యూ కార్యకలాపాలు జరుగుతున్నాయి. మండల వ్యవసాయాధికారి కార్యాలయం శిథిలమైపోయింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం నిర్మించడంతో వ్యవసాయ రంగ కార్యకలాపాలు అక్కడే జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి నూతన నిర్మాణాలను చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి

స్థానిక ఠాణా వీధిలోని బాలికల వసతి గృహం భవనం శిథిలమైంది. సుమారు 10 సెంట్ల స్థలం రెండు కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే బాగుంటుంది. ఖాళీ ప్రదేశాలు, శిథిల భవనాలు ప్రజలకు ఇబ్బందికరం.

– మన్నే పోతరాజు, మాజీ జెడ్పీటీసీ, ఆకివీడు

శిథిల భవనాన్ని తొలగించాలి



స్థానిక పెదపేటలోని బీసీ హాస్టల్ భవనం శిథిలమై ఖాళీగా ఉండటంతో విషపురుగులు, పాములు చేరుతున్నాయి. సుమారు 15 సెంట్ల విలువ కలిగిన ఈ స్థలంలో సచివాలయ, హాస్టల్ ఇతర అవసరాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధిచేయాలి.

– వంగా ప్రకాష్, పెదపేట, ఆకివీడు

యువత పోరుకు తరలిన నేతలు



యువత పోరుకు బయలుదేరుతున్న నాయకులు

కాళ్ల: యువతకు ఇచ్చిన హామీలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి సోమవారం నియోజకవర్గ స్థాయి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కాళ్ల మండలం పెద్ద అమీరం పార్టీ కార్యాలయం నుంచి నియోజవర్గ నుంచి తరలివచ్చిన నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు యువత, విద్యార్థుల తరుపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందన్నారు. ప్రతినెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన యువతకిచ్చిన వాగ్దానం అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు.

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషిచేయాలి



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: పట్టణంలో జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేయడానికి కృషి చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి పోలీసు స్టేషన్‌లో ఎన్ని రాజీపడదగ్గ కేసులున్నాయనే వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న కేసుల రాజీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, 1వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ పి.హనీష, 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి, బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె సుజాత, వివిధ పోలీసుస్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి చెరువులను కాపాడాలని ధర్నా



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆక్వా చెరువుల కాలుష్యం కారణంగా మంచినీళ్లు కలుషితమవుతున్నాయని, గుక్కెడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెండున్నర ఎకరాల మంచినీటి చెరువుకు నీరువచ్చే పంట కాలువల వెంబడి ఆక్వా చెరువుల కారణంగా మంచినీటి చెరువు కలుషితమైందన్నారు. కొందరు స్వార్థంతో చేపల చెరువులకు అనుమతులు తీసుకుని అక్రమంగా రొయ్యలు సాగుచేస్తున్నారన్నారు. దీంతో ఆక్వా చెరువులోని కలుషిత జలాలు పంట కాలువలో కలిసి చెరువులోని నీరు దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టాలని ఎన్ని వినతులు ఇచ్చినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బొక్క కూర్మారావు, బుడిటి అలరాజు, కొరశిఖ దుర్గమ్మ, తోట సుబ్బలక్ష్మి, తోట భవాని, దండుబోయిన దానమ్మ, బొర్రా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కరించాలి



డ్వాక్రా మహిళల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: కూటమి ప్రభుత్వం సున్నా వడ్డీ సౌకర్యం కల్పించకపోవడం దారుణమని డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో సోమవారం డ్వాక్రా మహిళల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలకు వడ్డీల భారం తడిసి మోపుడవుతోందని వాపోయారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళలకు అభయ హస్తం పేరుతో చాలా మంది డబ్బులు కట్టడం జరిగిందన్నారు. ఉపకార వేతనాలు, పింఛన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీనిధి పేరుతో లక్షల రూపాయలు డిపాజిట్లుగా సమృద్ధి పొదుపులు కట్టించుకున్నారన్నారు. 2018 నుంచి శ్రీనిధి రుణాల్లో భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆమె వాపోయారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పొదుపు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ కె.ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు సీపీఎల్ రుణాలు తీసుకోవాలని సూచించారు. నాయకులు యర్రా కృష్ణవేణి, జీవీ.లావణ్య రాణి, బీ.కల్యాణి, బీ.కృష్ణవేణి, జ్యోతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌తో ఉపాధి అవకాశాలు



భీమవరంలో మోడలింగ్ అండ్ బాడీ బిల్డింగ్ పోటీల దృశ్యం

భీమవరం: ఒలింపిక్ డే సందర్భంగా పట్టణంలోని బీవీ రాజు వీరమ్మ పార్క్ వద్ద సోమవారం మిస్టర్ గరుడ మోడలింగ్ అండ్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. బాడీ బిల్డింగ్ ద్వారా యువతకు శరీర సౌష్టవంతో పాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఎన్నో ఏళ్లుగా బాడీ బిల్డింగ్‌లో శిక్షణ ఇస్తూ పోటీలు నిర్వహిస్తున్న షేక్ ఖాసింను అభినందించారు. అనంతరం విజేతలు షేక్ మున్నా, తోట షణ్ముఖ్‌లకు సుమారు రూ.30 వేలు విలువ చేసే రిఫ్రిజిరేటర్, ఎయిర్ కూలర్ బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, సీనియర్ బాడీ బిల్డర్స్ బొల్లా శ్రీను, దాసి వరప్రసాద్, మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, కోచైర్మన్ కార్మూరి బాబు, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, షేక్ ఖాజీ, యాతం శ్రీనివాస్, కోడే రాజు, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న జాతీయ రహదారి



స్థానిక తెల్లవంతెన సమీపంలో కుంగిపోయి పంట కాల్వలోకి జారిపోతున్న జాతీయ రహదారి

ఆకివీడు: రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడంతో జాతీయ రహదారి ఉండి పంట కాల్వలోకి కుంగిపోతోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక తెల్ల వంతెన వద్ద నుంచి చెరుకువాడలోని వెంకటేశ్వరస్వామి గుడి వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. పలు చోట్ల రోడ్డు ఎత్తు పల్లాలతో ఉడడంతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే గానీ రహదారి పటిష్టానికి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిటైనింగ్ వాల్ నిర్మించి రహదారి పటిష్టానికి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ నీరజ

పాలకొల్లు సెంట్రల్: రెండు వారాలకు మించి దగ్గు, తెమడ పడటం, సాయంత్రం సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర టీబీ ముక్తి భారత్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నీరజ సూచించారు. సోమవారం పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. టీబీ పరీక్షల ల్యాబ్, ప్రసవ గది, ఇంజక్షన్ ఇచ్చు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ పై లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు మందులు ఉచితంగా అందిస్తారని, నెలకు రూ.వెయ్యి చొప్పున రూ. 6 వేలు ఇస్తారని తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేయరాదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం నవ్య జీవన్, కె.సందీప్, గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్, కె.అమలేశ్వరరావు, స్వామి, రమేష్ బాబు, కె.సత్తిబాబు, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రుద్రహోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పురస్కరించుకుని రుద్రహోమం శాస్త్రోకంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు గోపూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు, అనంతరం రుద్రహోమం చేశారు. ఏడు గురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో కొత్త కోర్సులు



క్యాంపెయిన్ చేస్తున్న ఏఎస్ఎన్ఎం కళాశాల అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ కళాశాలల్లో చేరితే ప్రభుత్వం నుంచి అనేక పథకాలు అందుతాయని, మంచి ప్లేస్‌మెంట్‌లు కూడా ఉంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి అన్నారు. సోమవారం పట్టణ పరిసర ప్రాంతాల్లో అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ఎం) ప్రభుత్వం డిగ్రీ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. కళాశాల స్వయం ప్రతిపత్తి కలిగి ఉండడంతో నోడల్ సెంటర్‌గా వ్యవహరిస్తూ జాబ్‌మేళా ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థునులకు టైలరింగ్, మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ వర్క్‌లలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఏసి మెకానిజం, సబ్బులు తయారీ, సేంద్రియ ముడి పదార్థాలతో చాక్లెట్ల తయారీలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. డ్యూయల్ మేజర్ కోర్సులతో బీఎస్సీ (మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, స్టాటిటిక్స్, బికాం (జనరల్), బీకాం కంప్యూటర్స్, బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ)లతో పాటు ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎంఎస్సీ (ఆక్వాకల్చర్), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్సీ (బోటనీ) వంటి కోర్సులు ఈ ఏడా నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాల వద్ద హెల్ప్ డెస్క్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కె భద్రాచలం, వియామిని, బూసి వెంకటస్వామి, ఎన్‌వీడీ దినకరన్, శివకృష్ణ, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలి



ఆర్డీఓ రాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం పేదలకు 25 శాతం ఉచిత అడ్మిషన్లు అమలు చేయాలని పేరెంట్స్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ విద్యాసంస్థలు అమలు చేయడంలేదని పేర్కొన్నారు. అడ్మిషన్స్ అయిపోయాయని, సీట్లు లేవని వంకలు చెబుతున్నారని వివరించారు. నిబంధనలు అమలు చేయని, అధిక ఫీజులు వసూలు చేస్తోన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మార్పిడి కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకురావాలి

భీమవరం: విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని తమిళనాడులోని మధురై త్యాగరాజ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎస్ భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా విధానంలో టీచింగ్ లెర్నింగ్‌లో లక్ష్యాలు సాధించే దిశగా మార్పులు జరగాలన్నారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యాబోధన ఉంటే విద్యార్థులు మరిన్ని ఫలితాలు సాధించగలరని భాస్కర్ నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు కూడా నూతన అంశాల అధ్యయనం చేసేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పాలకోడేరు: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు నేతృత్వంలో సోమవారం గరగపర్రులో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.రాజు వద్ద ఏడు మద్యం సీసాలు లభ్యం కావడంతో అతడిని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సైలు పి ఉమామహేశ్వరరావు, పి సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు మండల వైద్యాధికారిగా గులాబ్ రాజ్‌కుమార్

పాలకోడేరు: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిగా ఎం.గులాబ్ రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వీరవాసరం మండలంలో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పాలకోడేరుకు వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు కాళ్ల పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గులాబ్ రాజ్‌కుమార్ గతంలో పాలకోడేరులో పనిచేయడంతో మండల ప్రజలకు సుపరిచితులు.

మీకోసంకు ఐదు అర్జీలు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బదలాయించినట్లు ఆమె చెప్పారు. దుంపగడప గ్రామంలోని మంచినీటి చెరువుకు ఆనుకుని రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని, చెరువు నీటిని పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని మూడేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఫిర్యాదు చేశారు. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద పెదపల్లి వీధి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని, అలాగే స్థానిక ఉల్లర్లపేటలోని దారి మార్గం సర్వే చేయాలని, ధర్మాపురంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్లు ఖాళీ చేసేందుకు ఆరు నెలలు గడువు కోరుతూ అర్జీలు అందాయి.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

భీమవరం: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సోమవారం భీమవరం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విధుల బహిష్కరణ

నరసాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులు,కార్మికులు చేపట్టిన ఆందోళనను సోమవారం నుంచి ఉధృతం చేశారు. విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి బైఠాయించారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించకపోవడం దారుణమన్నారు.